వేగంగా శిథిలాల తొలగింపు

» ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి

6



ఇసుక శిథిలాలను కత్తిరిస్తున్న రెస్క్యూ సిబ్బంది

రావడం.. వెళ్లడం..!

● ర్యాలంపాడు లీకేజీల విషయంలో ఆరేళ్లుగా ఇదే తంతు

» నివేదికలు ఇస్తున్నా మరమ్మతులు చేపట్టడంలో జాప్యం
» ఇప్పటికే పలుమార్లు మారిన అంచనాలు, స్పందన కరువు
» తాజాగా సెంట్రల్ వాటర్ రిసోర్స్ స్టేషన్ నిపుణుల పరిశీలన
» 4 టీఎంసీలకు గాను ఆరేళ్ల నుంచి 2 టీఎంసీల నీటి నిల్వలు



ర్యాలంపాడు రిజర్వాయర్



ర్యాలంపాడురిజర్వాయర్ పరిశీలనకు వచ్చిన సెంట్రల్ వాటర్ రిసోర్స్ స్టేషన్ ప్రతినిధులు (ఫైల్)

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు రిజర్వాయర్ మరమ్మతులకు గ్రహణం వీడటం లేదు. ఎత్తిపోతల పథకం ప్రారంభించిన కొద్దిరోజులకే లీకేజీల సమస్య ఏర్పడగా ఆరేళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. పలుమార్లు నిపుణుల కమిటీలు వచ్చి వెళ్లి ప్రభుత్వానికి నివేదికలు అందిస్తున్న ప్పటికీ నిధులు విడుదల చేసి మరమ్మతులు చేపట్టడంలో అంతులేని జాప్యం నెలకొంటోంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 4 టీఎంసీలు కాగా, కట్టపై ఒత్తిడి పెరిగి తెగే ప్రమాదం ఉందనే అంచనాల మేరకు ఆరేళ్లుగా రెండు టీఎంసీలను మాత్రమే నిల్వ చేస్తున్నారు. ఫలితంగా ఈ ఎత్తి పోతల్లో కీలకమైన ఈ రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీరందడం లేదు. అదే కాకుండా చిన్నోనిపల్లి రిజర్వాయర్, నెట్టెంపాడు ఆర్డీఎస్ లింక్ కెనాల్, గట్టు ఎత్తిపోతల పథకానికి కూడా ఈ రిజర్వాయర్ ఆధారం. తాజాగా పుణెలోని సెంట్రల్ వాటర్ రిసోర్స్ స్టేషన్ నిపుణులు గత వారం రిజర్వాయర్‌ను పరిశీలించి మట్టి, రాళ్ల శాంపిళ్లను తీసుకెళ్లారు. ఇప్పటికే పలుమార్లు నిపుణుల బృందాలు పరిశీలించి కట్ట భద్రత కోసం చేపట్టాల్సిన మర మ్మతులపై నివేదికలు అందజేసినా వాటికి ఆమోదం లభించలేదు. 2023లోనే ప్రత్యేక కమిటీ నివేదిక ఇవ్వగా అందులో కట్ట రివిట్‌మెంట్‌ను, దాంతో పాటు కొంత మట్టిని తొలగించి జియో మెంబ్రేన్ షీట్లు వేయాలని సూచించింది. తర్వాత మళ్లీ మట్టితో కట్ట నిర్మించి రివిట్‌మెంట్ వేయాలని పేర్కొన్నది. అయినా ఇప్పటివరకు ఆమోదం తెలుపక పోగా మరో నెలన్నర రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుంది. వరద ప్రారంభమైన వెంటనే నెట్టెం పాడు ఎత్తిపోతల మోటార్లను ఆన్ చేస్తారు. దీంతో ఈ సంవత్సరం కూడా

- మిగతా 6లో..

సిరసనగండ్ల హుండీ లెక్కింపు

7

» రూ. 12.67 లక్షల ఆదాయం

కొనుగోలు కేంద్రం.. పోటాపోటీగా ప్రారంభం

» మొదట మార్కెట్ కమిటీ చైర్మన్, ఆ తర్వాత ఎమ్మెల్యే

7

ట్రాన్స్‌జెండర్‌తో పాటు మరో ముగ్గురి అరెస్ట్

» వెల్లడించిన సీఐ టంగుటూరి శ్రీను

7

జూరాలలో.. డెడ్ స్టోరేజీ

» తాగునీటి కోసం ప్రత్యేక కార్యాచరణ
» గత ఏడాది రూ.1.89 కోట్లతో పథకాలకు మరమ్మతులు
» ఈ ఏడాది రూ.కోటి విడుదల



జూరాలలో పడిపోయిన నీటి నిల్వలు, గ్రిడ్ వద్ద మోటార్లకు నీరందించేందుకు తీసిన కాలువ

గద్వాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరింది. ప్రస్తుతం జూరాలలో 0.253 టీఎంసీల నీరు ఉంది. ఒకపక్క పంటలను కాపాడాలని రైతులు ధర్నా చేస్తుండగా మరోపక్క మిషన్ భగీరథ పథకానికి నీళ్ల అందని పరిస్థితి. పంటలు కాపాడాలని ఇరిగేషన్ మంత్రి నుంచి ఆదేశాలు రావడంతో ఏప్రిల్ 8వ తేదీన రెండు రోజుల పాటు నీటిని విడుదల చేశారు. మళ్లీ బుధవారం (ఏప్రిల్ 16) మధ్యాహ్నం కాలువలకు నీటిని విడుదల చేశారు. దీంతో దాదాపుగా పంటలు గట్టెక్కే అవకాశం ఉన్నప్పటికీ తాగునీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. ప్రస్తుతం జూరాలలో 0.253 టీఎంసీల నీరు ఉంది. రెండు రోజులపాటు కాలువలకు నీటిని విడుదల చేస్తే పూర్తిగా డెడ్‌స్టోరేజీకి చేరుతోంది. దీంతో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు సూచనలు చేశారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల వద్ద నిధులు లేకపోవడంతో ప్రభుత్వం కోటి రూపాయలు విడుదల చేసింది.

నీటి ఎద్దడి నివారించేందుకు యాక్షన్ ప్లాన్

జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వలు పడిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. పంచాయతీల వద్ద నిధులు లేకపోవడంతో ప్రభుత్వం కోటి రూపాయలు విడుదల చేసింది. కలెక్టర్ కూడా తన ప్రత్యేక నిధుల నుంచి రూ.20లక్షలు ఖర్చు చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ప్రస్తుతం గ్రామాల్లో బోర్లు, విద్యుత్ మోటర్లకు మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచారు.

జిల్లాలో 313 గ్రామాలు ఉండగా దీవి గ్రామం గుర్రంగడ్డకు తాగునీటి పథకాలు లేవు. మిగిలిన 312గ్రామాలలో 213గ్రామాలకు ప్రస్తుతం గ్రీన్ జోన్‌లో ఉన్నాయి. కానీ 84గ్రామాలలో నీటి సమస్య ఉంది. మరో 12 గ్రామాలలో సమస్య తీవ్రంగా ఉంది.

కర్ణాటక ప్రభుత్వంపై ఆశలు..

కర్ణాటక కరుణిస్తే జూరాలకు 0.70 టీఎంసీల నీరు వస్తుంది, దీంతో వేసవిలో నీటి ఎద్దడి తీరుతుందని అధికారులు భావిస్తున్నారు. మంగళవారం నుంచి గుగల్ బ్యారేజ్ ద్వారా సీఫేజ్ వాటర్ మొదలైంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులోకి 687 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో నీటి సమస్య తలెత్తదనే అధికారుల ఆశిస్తున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. గ్రిడ్ నుంచి వచ్చిన నీళ్ల ఇంటింటికి సరఫరా చేస్తాం. ఒకవేల నీటి కొరత ఏర్పడితే పీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా సరఫరా చేస్తాం. అక్కడికి ఇబ్బందులు ఉంటే ట్యాంకర్లతో అందిస్తాం. నీటి సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం.

- శ్రీధర్‌రెడ్డి, ఈఈ, ఇంట్రా మిషన్ భగీరథ గద్వాల

అర్హులందరికీ సన్నబియ్యం

ఎండబెట్లలో బియ్యం పంపిణీని పరిశీలించిన కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తోందని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ మండలంలోని ఎండబెట్ల రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ విధానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించిందని తెలిపారు. పేదలకు ఆర్థిక భారం లేకుండా సన్నబియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈ పథకం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, తహసీల్దార్, నాయకులు తదితరులు ఉన్నారు.



బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

సఖి సెంటర్‌లో భద్రత కరువు

» కౌన్సెలింగ్ ఇచ్చే వారు లేక ఇక్కట్లు
» కొత్త ఏజెన్సీ కోసం ఎదురుచూపులు
» త్వరలోనే సమస్యలు పరిష్కారం : డీడబ్ల్యూవో

7



'హై సెక్యూరిటీ' తప్పనిసరి

» అన్ని వాహనాలకూ హెచ్ఎస్ఆర్ నెంబర్ ప్లేట్లు
» ఇటీవల ఆదేశించిన సుప్రీంకోర్టు
» ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ
» ధర కనిష్ఠ రూ. 320, గరిష్ఠం రూ. 800

6



జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

సాగునీటిపై రాజకీయాలొద్దు

» మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి
» జూరాల ప్రధాన ఎడమ కాలువ నుంచి 550 క్యూసెక్కుల నీటి విడుదల

ఆత్మకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటలు కాపాడుకునేందుకు నీటిని విడుదల చేస్తే కొంతమంది రాజకీయాలు చేస్తున్నారని, సాగునీటిపై రాజకీయాలు సరికాదని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద 550 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నీటిని విడుదల చేశామని, ఈనెల చివరి నాటికి మరో టీఎంసీ నీరు విడుదలకు కృషి చేస్తున్నామని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్రాప్ హాలిడే ఇచ్చిన విషయం మర్చిపోయారా.. అని మండిపడ్డారు. తాము రైతులను ఇబ్బంది పెట్టకుండా యాసంగిలో కూడా వరి పంటను వేయిస్తే వారి కళ్లు మండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జపాన్ పర్యటన నుంచి వచ్చిన వెంటనే కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడించి మరోసారి నీటిని విడుదల చేయిస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కల్లు విభాగం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, జూరాల ప్రాజెక్టు ఎస్ఈ, ఏఈ, నాయకులు ఉన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కోదండరెడ్డి

భూసమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి

- రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి


వంగూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అభిప్రాయాలను క్రోడీకరించి భూసమస్యల శాశ్వత పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని రూపొందించిందని రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. బుధవారం నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు మండలంలోని పోల్కంపల్లి రైతువేదికలో నూతన రెవెన్యూ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కోదండరెడ్డితో పాటు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ అమరేందర్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో రెవెన్యూ చట్టాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రెవెన్యూ వ్యవస్థను సరిదిద్దేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టాన్ని అమలులోకి తెచ్చారని, భూమి హక్కులు రైతులకే ఉండాలని స్పష్టం చేశారన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డి రైతు కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. ధరణి సమస్యలు భూ భారతితో తొలగిపోతాయని అన్నారు. గతంలో మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ లక్షల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేశారని గుర్తు చేశారు. 2017 డిసెంబరులో భూ రికార్డుల ప్రక్షాళన చేసిన ధరణి రైతులకు శాపంగా మారి రెవెన్యూ వ్యవస్థ ఛిన్నాభిన్నం అయ్యిందని ఆరోపించారు. నూతన భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత వంగూరులోని తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ మురళీదర్, డీటీ వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సీఈవో విష్ణుమూర్తి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎవరి కోసం.. ఎందుకోసం?

ఇది వనపర్తి- పెబ్బేరు ప్రధాన రహదారి.. కలెక్టరేట్‌కు అతిసమీపంలోనే ఉంటుందీ దారి.. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ దారి వెంటనే రోజూ వెళ్లి వస్తుంటారు. ఈ దారిపై ప్రస్తుతం కల్వర్టు, సీసీ రోడ్డు పనులు నడుస్తున్నాయి. అది ఎందుకోసమో.. ఎవరికోసమో తెలియని దురవస్థ ఉంది. సాధారణంగా కల్వర్టులు, బ్రిడ్జిలు.. కింద నుంచి కాలువలో, డ్రెయినేజీలు, తూములో, వాగులో వెళ్తుంటే కడతారు. కానీ పక్కనే కుంట ఉన్నా.. దాని నుంచి ఇటు వచ్చే కాలువను ఏనాడో పూడ్చేశారు. కాలువ లేదు.. తూము లేదు. అయినా వేసవిలో ఏ అత్యవసర పనులు లేనట్లుగా సుమారు రూ. 15లక్షలతో చేపడు తున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడికి ఈ పనులు అప్పగించారు. దీన్ని అధికారులు ఎలా ఆమోదించారు? ఇలా వెళ్తున్న కలెక్టర్‌కు కూడా పనుల ఔచిత్యం కనిపించడం లేదా? ఇంత ఇష్టారాజ్యమా? నియోజక వర్గంలో ఇంకా ఏ అత్యవసర పనులు లేవా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అటుగా వెళ్తున్న ప్రజలు ఈ పనులను చూసి విస్తుపోతున్నారు. కానీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ఎవరేమనుకుంటే మాకేంటి అన్నట్లుగా వెళ్లిపోతున్న పరిస్థితి...

- ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

క్లిక్.. క్లిక్..



వనపర్తి జిల్లా బొల్లారం- వల్లభాపురం గ్రామల మధ్యన వాగుపై నిలిపివేసిన వంతెన పనులు



నిలిచిన లింక్ కెనాల్ పనులు

» భూసేకరణ చేపట్టకపోవడంతో సింగోటం - గోపల్‌దిన్నె పనుల నిలిపివేత
» సాగు నీరు లేక ఇబ్బంది పడుతున్న రైతులు
» ఎకరాకు పరిహారం రూ.16 లక్షలు ఇవ్వాలని డిమాండ్
» ససేమిరా అంటున్న ప్రభుత్వం

6

మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని కేజీబీవీ



కేజీబీవీలలో ఏం జరుగుతోంది?

» విద్యార్థులు, టీచర్ల మధ్య సఖ్యత లేదా?
» రాజాపూర్, కోయిలకొండ, నాగనూల్‌లలో వరుస ఘటనలు

దర్యాప్తులో నిర్లక్ష్యం చేయొద్దు

- ప్రజల్లో నమ్మకం కలిగేలా పని చేయాలి
- నేర సమీక్షలో ఎస్పీ జానకి



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం లేకుండా, నిష్పక్షపాతంగా దర్యాప్తు సాగాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి పోలీసులను ఆదేశించారు. నేరస్థులకు శిక్షల పడే శాతం పెరగాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్కిల్ పోలీస్‌స్టేషన్ల వారీగా నేరాలు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్, యూఐ కేసుల పరిస్థితిని ఆరాతీశారు. యూఐ కేసులు విచారణ దశలోనే ఎందుకు నిలిచి పోతున్నాయో కారణాలను ఆరా తీశారు. వాటిని వెంటనే పరిష్క రించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ, పోక్సో కేసులను పరిశీలిస్తూ నిందితులకు గరిష్ఠంగా శిక్షప డేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టులో ట్రయల్ నడిచే సమ యంలో సాక్షులకు పకడ్బందీగా బ్రీఫ్ చేయాలని సూచించారు. బాధితులకు కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాలు, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. దొంగతనాల కేసుల్లో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా పని చేయాలని చెప్పారు. ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ రాములు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆ రబీ డీఎస్పీ రమణారెడ్డి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, ఎజాజుద్దీన్, కమలాకర్, నాగార్జునగౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ

పాలమూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ సర్వీసింగ్, మరమ్మతుపై యువకులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐఆర్‌ఎస్‌ఈటీఐ) సంచాలకులు జి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాలకు చెందిన 18 - 45ఏళ్ల వయసు కలిగిన పురుషులు శిక్షణకు అర్హులని తెలిపారు. ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపికైన వారికి 30 రోజుల పాటు శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యం, యూనిఫామ్, టూల్‌కిట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిట్టీల పేరుతో మోసం.. టీచర్ సస్పెన్షన్

వెల్దండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన ఉపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఎంఈవో చంద్రుడు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, రావిచెట్టుబావి తండా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న పాలడి కిషోర్ అనే ఉపాధ్యాయుడు ప్రైవేట్ చిట్టీలు, ఫైనాన్స్ పేరుతో ప్రజల నుంచి డబ్బు వసూలు చేశాడు. కానీ వారికి తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతడిని సస్పెండ్ చేసినట్లు ఎంఈవో తెలిపారు.

జింకపై ఊర కుక్కల దాడి

బిజినేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని కీమ్యా తండా సమీపంలోని గంగారం ఫారెస్ట్ బీట్‌లో జింకపై ఊర కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు, ఎఫ్ఆర్‌వో దేవరాజు తెలిపిన వివరాల మేరకు.. ఓ జింక నీటి కోసం అటవీ ప్రాంతం నుంచి తండా సమీపంలోని పొలాల్లోకి వచ్చింది. ఊరకుక్కలు దానిపై దాడి చేశాయి. తండావాసులు గమనించి కుక్కలను తరిమేశారు. జింక అడవిలోకి వెళ్లిపోయింది. ఎఫ్ఆర్‌వో చేరుకొని విచారించారు.

హై సెక్యూరిటీ తప్పనిసరి

- అన్ని వాహనాలకూ హెచ్ఎస్ఆర్ నెంబర్ ప్లేట్లు
- ఇటీవల ఆదేశించిన సుప్రీంకోర్టు
- ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ
- ధర కనిష్ఠం రూ. 320, గరిష్ఠం రూ. 800





షోరూంలో అమ్మకానికి ఉంచిన వివిధ రకాల ద్విచక్ర వాహనాలు



హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్

అయిజ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో అన్ని వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు (హెచ్‌ఎస్ఆర్‌పీ) తప్పనిసరి కానున్నాయి. వాహనాల దొంగతనాలను అరికట్టేందుకు, రహదారి భద్రతను కాపాడేందుకు, రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొని ప్రణాళికలను సిద్ధం చేసింది. 2019, ఏప్రిల్ 1వ తేదీ కంటే ముందు తయారైన అన్ని రకాల వాహనాలకు హెచ్‌ఎస్ఆర్ నెంబర్ పేట్లను బిగించుకోవాలని రవాణా శాఖ ఉత ర్వులు జారీ చేసింది. అందుకు అనుగుణంగా ఈ నెల 9న గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఈ ప్రకియ కొనసాగనున్నది. 2019 ఏప్రిల్ 1వ, తేదీ తరువాత తయారైన వాహనాలకు ఇప్పటికే ఆయా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో హెచ్ఎస్ఆర్‌పీ నెంబర్ ప్లేట్లను బిగిస్తున్నారు. ఈ విధానంతో నకిలీ నెంబర్ ప్లేట్లకు అడ్డుకట్ట పడుతుందని ఉన్నతాధికారులు చెప్తున్నారు.

జిల్లాలో 1,46,629 వాహనాలు

జోగులాంబ గద్వాల జిల్లాలో వివిధ రకాల వాహనాలు 1,46,629 ఉన్నాయి. వాటిలో ద్విచక్ర వాహనాలు 1,14,555, కార్లు 8,309 ఉన్నాయి. వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్లు 6,165 ఉన్నాయి. వ్యాపార అవసరాలకు ఉపయోగించే ట్రాక్టర్లు 2,285 ఉన్నాయి. వ్యవసాయ అవసరాలకు ఉపయోగించే ట్రాలీలు 3,228, వ్యాపార అవసరాలకు వినియోగించే ట్రాలీలు 1,898 ఉన్నాయి. గూడ్స్ క్యారేజీలు 4,639, మూడు చక్రాల ఆటోలు 2,342 ఉన్నాయి. విద్యాసంస్థల బస్సులు 286 ఉన్నాయి. అలాగే మోపెడ్లు 269 ఉన్నాయి. మోటారు క్యాబ్‌లు 596, ప్రైవేటు ఓమినీ బస్‌లు 206 ఉన్నాయి. వీటితో పాటూ స్టేజీ క్యారేజీలు 108, మూడు చక్రాల గూడ్స్ వాహనాలు 716, ట్రాక్టర్ హార్వెస్టర్స్ 450, నిర్మాణ పనులకు సంబంధించిన వాహనాలు 253 వాహనాలు, ఇతర రకాలకు చెందిన వాహనాలు 2,609 ఉన్నట్లు రవాణా శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

వాహనాన్ని బట్టి ధర

వాహనం రకాన్ని బట్టి ప్రభుత్వం కొత్త నెంబర్ ప్లేట్ల ధరలను నిర్ణయించింది. ద్విచక్ర వాహనాలకు మోడల్‌ను బట్టి రూ. 320 నుంచి రూ. 380 కాగా, ఇంపోర్టెడ్ ద్విచక్ర వాహనాలకు రూ. 400 నుంచి రూ. 500 వరకు ధర ఉంటుంది. సాధారణ కార్లకు రూ. 590 నుంచి రూ. 700 వరకు, ఇంపోర్టెడ్ కార్లకు రూ. 700 నుంచి రూ. 860, మూడు చక్రాల వాహనాలకు రూ. 350 నుంచి రూ.450 వరకు ధర నిర్ణయించింది. అన్ని రకాల కమర్షియల్ వాహనాలకు రూ.600 నుంచి రూ. 800 వ రకు ధర ఉంటుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

హెచ్ఎస్ఆర్‌పీ తప్పనిసరి

హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్ బిగించుకోకపోతే యజమానులు తమ వాహనాలను అమ్ముకోలేరని ఉత్తర్వులో ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతే కాకుండా ఇన్సూరెన్స్, పొల్యూషన్ ధ్రువపత్రాల జారీని కూడా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. గడువు తేదీ ముగిసినా హెచ్ఎస్ఆర్ నెంబర్ ప్లేట్లు లేని వాహనాలకు తనఖీ అధికారులు భారీగా జరిమానాలు వేయనున్నారు. అలాగే ఎక్కువ సార్లు పట్టుబడితే సీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

చోరీలను అరికట్టాలి



వాహనాల చోరీలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఇళ్ల ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలు ఎక్కువగా చోరీకి గురవుతున్నాయి. ఇళ్లలో స్థలం లేని వారు బయట వాహనాన్ని నిలిపి ఉంచడం తప్పనిసరి అవుతోంది. ఒక వేళ వాహనం చోరీకి గురైతే కొద్ది సమయంలోనే వాటిని గుర్తించి యజమానికి అప్పగించే సౌకర్యం ఉండాలి. అందుకు అనుగుణంగా రవాణా శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటడం మంచిదే.

\- శేషన్‌గౌడు, మాజీ సర్పంచ్, కంచుపాడు

వాహనదారుల్లో మార్పు రావాలి



ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసే వాహనదారుల్లో మార్పురావాలి. ఇప్పటికే చాలా మంది వాహనం కొనుగోలు చేసి నెల రోజుల తరువాత షో రూంకు వచ్చిన నెంబర్ ప్లేట్లను తీసుకువెళ్లేందుకు చాలా ఆలస్యం చేస్తారు. 10 సార్లు ఫోన్ చేసినా స్పందించకుండా ఉంటున్నారు. ఇప్పుడు వస్తున్న హెచ్ఎస్ఆర్‌పీ నెంబర్ ప్లేట్లతో వాహనాలకు అత్యంత భద్రత లభిస్తుంది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవటం చాలా మంచిది.

\- సందీప్,
మేనేజర్ హోండా షోరూం (అయిజ)

ఉత్తర్వులు వచ్చాయి



హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు 2019 ఏప్రిల్ 1 కంటే ముందు తయారైన వాహనాలన్నింటికీ తప్పనిసరి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గద్వాల జిల్లాలో దాదాపు 30 నుంచి 40 శాతం వాహనాలకు హెచ్ఎస్ఆర్‌పీ నెంబర్ ప్లేట్లు అవసరం ఉండొచ్చు. ప్రతీ వాహనదారుడు నిర్దేశిత రుసుం చెల్లించి, సెప్టెంబర్ 30 నాటికి వారి వాహనాలకు కచ్చితంగా ఈ నెంబర్ ప్లేట్లను బిగించుకోవాలి.

\- టీవీ రావు, రవాణాశాఖ అధికారి, గద్వాల

వేగంగా శిథిలాల తొలగింపు

- ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి

దోమలపెంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎల్ బీసీ సొరంగంలో శిథిలాల తొలగింపు వేగంగా కొనసా గుతోందని ప్రతేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. సొరంగం దగ్గర వివిధ శాఖలకు చెందిన రెస్క్యూ బృందాల అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. శిథిలాల తొలగింపునకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన అధికారుల సూచనలతో పనులను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రెస్క్యూ సిబ్బంది మూడు షిఫ్ట్‌లలో పని చేస్తూ తవ్వకాలు జరుపుతున్నాయన్నారు. మిగిలిన 40 మీటర్ల పొడవునా, 3 మీటర్ల ఎత్తున బురద, మట్టి పేరుకుపో వడంతో సహాయక చర్యల్లో కొంత ఇబ్బంది ఎదురవుతున్నా, శిథిలాల తర లింపును రెస్క్యూ బృందాలు వేగంగా కొనసాగిస్తున్నాయని తెలిపారు. కత్తి రించిన టీబీఎం విడి భాగాలను, బండరాళ్లను లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నామని, ఊట నీటిని నిర్విరామంగా పంపింగ్ చేస్తున్నామని చెప్పారు. శిథిలాల తొలగింపునకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు తెలిపారు. సహాయక చర్యల్లో సింగరేణి రెస్క్యూ టీం మేనేజర్లు రాజేందర్‌రెడ్డి, మాధవరావు, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా, రైల్వే అధికారి రవీంద్రనాథ్, జీఎస్ఐ, ఇరిగేషన్, సంజయ్‌కుమార్ సింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



తవ్వకాల్లో బయట పడుతున్న టీబీఎం మిషన్ విడిభాగాలు

రావడం.. వెళ్లడం..

(5వ పేజీ తరువాయి)

మరమ్మతులు లేకపోవడంతో ఆయకట్టుకు నీరందడం గగనంగానే కనిపిస్తోంది.

ఏళ్లు గడుస్తున్నా మారని తీరు

రాష్ట్ర ప్రభుత్వం తక్కువ మొత్తంలో పూర్తయ్యే ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించింది. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు ప్రాజెక్టులపై మహబూబ్‌నగర్‌లో సమీక్ష నిర్వహించి నివేదికలు కూడా స్వీకరించారు. ఆ ప్రాజెక్టుల్లో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఆ తర్వాత రెండు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా కేటాయించిన నిధులు రివైజ్డ్ ఎస్టిమేషన్లకే సరిపోయాయి. పనులు మాత్రం ఎక్కడా ప్రారంభం కాలేదు. ఈ ఎత్తిపోతల పూర్తికి రూ. 231.36 కోట్లు అవసరమవుతాయని అంచనా వేయగా అవి రాలేదు. ఇది కాకుండా కేవలం ర్యాలంపాడు లీకేజీలను అరికట్టడానికే రూ. 156 కోట్లు అవసరమవుతాయని మొదట అంచనా వేయగా, ప్రస్తుతం ఆర్థిక శాఖ దగ్గర రూ. 144 కోట్లకు సంబంధించిన ఫైలు క్లియరెన్స్ కోసం ఉన్నది. గ్రౌంటింగ్ పద్ధతిలో మరమ్మతులు చేపట్టడానికి ప్రస్తుత అంచనాలు ఉండగా తాజాగా పరిశీలించిన సెంట్రల్ వాటర్ రీసోర్స్ స్టేషన్ నిపుణులు ఇచ్చే నివేదిక ఆధారంగా పద్ధతి ఏదైనా మారితే మరమ్మతులకు మరింత ఆలస్యమవుతాయని తెలుస్తోంది.

సగం ఆయకట్టుకే పరిమితం

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాన్ని జూరాల బ్యాక్ వాటర్ ఆధారంగా 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. రూ. 1425 కోట్ల అంచనాతో ప్రారంభించగా నేటికీ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ పథకంలో రెండు ఆన్‌లైన్, ఐదు ఆఫ్‌లైన్ రిజర్వాయర్లు నిర్మించారు. మొత్తం 2.10 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు కృష్ణానదిలో 21.5 టీఎంసీల నీటిని కేటాయించారు. మొదట బ్యాక్ వాటర్ నుంచి 1.8 కిలోమీటర్ల దూరం గ్రావిటీ ద్వారా నీటిని తీసుకెళ్లి అక్కడ నుంచి ఒక టీఎంసీ సామర్థ్యంతో ఉన్న గూడెందొడ్డి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి 8 కిలోమీటర్లు గ్రావిటీ ద్వారా నీటిని తరలించి లిఫ్టు-2 ద్వారా ర్యాలంపాడు రిజర్వాయర్‌లో పోస్తారు. అక్కడ నుంచి సంగాల, చిన్నోనిపల్లి, నాగర్‌దొడ్డి, ముచ్చోనిపల్లి, తాటికుంట రిజర్వాయర్లకు తరలించారు. గుడ్డెందొడ్డి కింద 63 వేల ఎకరాలు, ర్యాలంపాడు కింద 1.37 లక్షల ఎకరాలకు నీరందాలి. కానీ, ప్రస్తుతం ఇందులో సగం ఆయకట్టుకు కూడా నీరందడం లేదు. ర్యాలంపాడు రిజర్వాయర్‌ను మొదట 2 టీఎంసీల సామర్థ్యంతోనే నిర్మించగా తర్వాత దాన్ని 4 టీఎంసీలకు పెంచారు. ఇప్పుడు ఇదే రిజర్వాయర్ ఆధారంగా 1.3 టీఎంసీ సామర్థ్యం కలిగిన గట్టు రిజర్వాయర్‌ను నిర్మిస్తుండగా దాన్ని 4 టీఎంసీలకు విస్తరించాలనే ప్రతిపాదన కూడా ఉన్నది. ర్యాలంపాడుకు మరమ్మతులు చేసి లీకేజీలను అరికట్టకుండా ఇవన్నీ సాధ్యమయ్యే పనికాదు. ఆరేళ్లుగా నానుతున్న అంశాన్ని కొలిక్కి తేవాలని రైతులు కోరుతున్నారు.

కేజీబీవీలలో ఏం జరుగుతోంది?

- విద్యార్థులు, టీచర్ల మధ్య సఖ్యత లేదా?
- రాజాపూర్, కోయిలకొండ, నాగనూల్‌లో వరుస ఘటనలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీలలో టీచర్ల మధ్య గత మూడు నెలలుగా ఏదో ఒకచోట చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. ఇందుకు అక్కడ పని చేస్తున్న ఎస్‌వో, సీఆర్‌టీలు తప్పులకు పాల్పడుతున్నారన్న కారణంతో వారికి ఏదో రకమైన పనిష్మెంట్ విద్యాశాఖ అధికారులు ఇస్తున్నారు. కేజీబీవీలలో చదువు సరిగ్గా చదవడం లేదనో, చెప్పిన నోట్స్ రాయడం లేదనో తదితర చిన్న పొరపాట్లకు మందలిస్తే విద్యార్థులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నారు. మరొక చోట కులం పేరిట దూషించారని ఆందోళనకు దిగుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు పాఠశాలలో పని చేయాలంటేనే జంకుతున్నారు. విద్యార్థులు చదివినా, చదవకపోయినా, పాఠశాలకు వచ్చినా రాకపోయినా వారిని టీచర్లు ప్రశ్నించకూడదనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ప్రశ్నించిన ఉపాధ్యాయులపై తల్లిదండ్రులకు ఫిర్యాదులు చేస్తున్నారు. వరుసగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రాజాపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూల్, కోయిలకొండ కేజీబీవీలలో జరిగిన వరుస సంఘటనలే ఇందుకు నిదర్శనం.

రాజాపూర్ ఘటనతో కేజీబీవీలలో కలకలం

రాజాపూర్‌లో అక్కడి ఎస్‌వోకు, టీచర్లకు సొసగక పోవడంతో ఒకరి మధ్య ఒకరికి ఉన్న గొడవలు తారాస్థాయికి చేరాయి. దీంతో ఓ విద్యార్థిని మందలించిందని, కులం పేరుతో దూషించిందని, ఆ విద్యార్థి చెట్టుకు నీరు పోస్తే అది ఎండిపోతుందని ఓ సీఆర్‌టీ అన్నట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన విద్యాశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదిక సమర్పించడంతో ఆ ముగ్గురు సీఆర్‌టీలపై సస్పెన్స్ వేటు వేసిన విషయం తెలిసిందే. అక్కడికి వేరే కేజీబీవీల నుంచి ముగ్గురు సీఆర్‌టీలను పంపించినా విధుల్లో చేరలేదు. దీంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి కేజీబీవీ ప్రత్యేక ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ కలకలం కొనసాగుతుండగానే నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగనూలు కేజీబీవీకి చెందిన 9వ తరగతి విద్యార్థి తనను ఓ సీఆర్‌టీ వేధిస్తుందని చెయ్యి కోసుకుంది. ఆమెపై విచారణ జరుగుతుండగానే మంగళవారం అక్కడి కేజీబీవీ విద్యార్థులు ఆందోళనకు దిగి ఆ టీచర్‌ను విధుల నుంచి తొలగించే వరకు ఆందోళనను విరమించమని హెచ్చరించారు. ఈ విషయంలో సదరు సీఆర్‌టీపై చర్యలు తీసుకోకుండా అధికారులు ఆలస్యం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.



నాగర్‌కర్నూల్ : నాగనూలు కేజీబీవీ ఆవరణలో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు (ఫైల్)

కోయిల్‌కొండలో ఘటన..

కోయిల్‌కొండ మండల కేంద్రంలోని కేజీబీవీలో 9వ తరగతి విద్యార్థిని అక్కడ ఉండే సీఆర్‌టీ మందలించిందని దగ్గుమందులో ఫినాయిల్ కలుపుకొని సోమవారం తాగింది. దీంతో విద్యార్థిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా, ఆ విద్యార్థినికి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఎండోస్కోపి నిర్వహించారు. విద్యార్థినికి ఎలాంటి ప్రాణాపాయ పరిస్థితి లేదన్న వైద్యుల సూచనలతో తల్లితండ్రులతో ఇంటికి పంపించారు.

టీచర్ మందలించడంతో యాసిడ్ తాగింది వాస్తవమే...



కోయిల్‌కొండ కేజీబీవీలో ఓ విద్యార్థిని అక్కడున్న యాసిడ్‌ను దగ్గుమందుతో కలిపి తాగింది వాస్తవమే. ఇప్పుడా ఆ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి క్షేమంగానే ఉంది. వారి తాత వెంట ఊరికి పంపించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో, తహసీల్దార్‌లు చేపడుతన్నారు. వైద్యశాఖ తరుపున ఎంఈవోను పంపించాం. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటాం.

\- ప్రవీణ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి,
మహబూబ్‌నగర్

దురుసుగా మాట్లాడటం తగదు

- ఎస్‌వో, టీచర్, వర్కర్‌లపై చర్యలు
- డీఈవో ప్రవీణ్‌కుమార్

కోయిలకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులతో దురుసుగా మాట్లాడి వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఈవో ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యాయత్నం ఘటనపై బుధవారం ఆయన విచారణ చేపట్టారు. విద్యార్థులను వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. సోమవారం రాత్రి జరిగిన సంఘటన వివరాలను సేకరించారు. విద్యార్థులకు అందుబాటులో ఫినాయిల్, యాసిడ్ ఎందుకు పెట్టారని ఎస్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన ఎస్‌వో, టీచర్, వర్కర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కేజీబీవీలో విచారిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

నిలిచిన లింక్ కెనాల్ పనులు

- భూసేకరణ చేపట్టకపోవడంతో పనుల నిలిపివేత
- సాగు నీరు లేక ఇబ్బంది పడుతున్న రైతులు

పెబ్బేరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎంజీకేఎల్ఐలోని ప్యాకేజీ-16లో భాగంగా చేపట్టిన సింగోటం-గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనులు నిలిచిపోయాయి. జూరాల, భీమా ప్రాజెక్టుల పరిధిలో కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల, చిన్నంబావి, పాన్‌గల్, పెంట్లవెల్లి, కోడేరు, కొల్లాపూర్ మండలాల చివరి ఆయకట్టు భూములు ఉన్నాయి. ఈ భూములకు సాగునీరు పూర్తిస్థాయిల్లో అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిం చేందుకు కొల్లాపూర్ మండలంలోని ఎంజీకేఎల్ఐలో రెండో జలాశయమైన సింగోటం శ్రీవారిసముద్రం నుంచి 23 కిలోమీటర్ల మేర ప్యాకేజీ-16 కింద లింక్ కెనాల్ పనులు చేపట్టారు. వనపర్తి జిల్లాలోని జూరాల ప్రధాన ఎడవ కాలువ పరిధిలో గోపల్‌దిన్నె రిజర్వాయర్ వరకు 6 మీటర్ల వెడల్పుతో లింక్ కెనాల్ నిర్మాణం కోసం 2020లో శ్రీకారం చుట్టారు.

కాలువ నిర్మాణంలో 360 ఎకరాలు ముంపునకు గురవుతున్నట్లు అధికారులు సర్వే నివేదిక ప్రభుత్వానికి అందజేశారు. 2022లో కెనాల్ పనులు ప్రారంభించారు. సింగోటం జలాశయం నుంచి పనులు చేపట్టడానికి ఆయకట్టు రైతులు అభ్యంతరం తెలపడంతో సొరంగ మార్గంలో కాలువ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. రైతులకు భూ పరిహారం తక్కువ ఇవ్వడంతో పనులను అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ భూమి చోట వీపనగండ్ల మండలంలోని వల్లభాపురం, బొల్లారం గ్రామాల మధ్యన పనులను ప్రారంభించారు. సమగ్ర సర్వే లేకపోవడంతో క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు ఉన్నట్లు, పాత లైన్‌మెంట్లో లేని సొరంగం పనులు తెరపై కి రావడంతో గుత్తేదారులు పనులు నిలిపివేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

భూసేకరణ కాకపోవడంతో..

ఎంజీకేఎల్ఐని ప్యాకేజీ-16లో సింగోటం-గోపల్‌దిన్నె లింక్ కెనాల్ నిర్మాణంలో భూ సేకరణ పనులు పూర్తి చేయలేదు. భూ సేకరణలో ఎకరాకు ప్రభుత్వం నుంచి రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పరిహారం ఇస్తామంటే రైతులు ఒప్పుకోవడం లేదు. ఎకరాకు పరిహారం రూ.16 లక్షలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం, రైతుల మధ్యన ఒప్పందం కుదరకపోవడంతో భూసేకరణ పనులు నిలిపివేశారు. సింగోటం నుంచి నర్సాయిపల్లి గ్రామం పరిధిలో చేపట్టే కాలువ నిర్మాణంలో మొదటగా కాలువ తవ్వాలని సర్వే చేపట్టగా రైతులు భూములు ఇచ్చేందుకు ఒప్పుకోలేదు. దీంతో టన్నెల్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. టన్నెల్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు సమాచారం.

రైతులు సహకరిస్తే పనుల్లో వేగం..

కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైతులు సహకరిస్తే భూ సేకరణ పనులు పూర్తి చేయడంతో పాటు పనులు ఏడాదిలో వ్యవధిలోనే పూర్తి చేస్తాం. ఇప్పటి వరకు చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు దాదాపుగా రూ.9 కోట్ల బిల్లులు చెల్లించారు.

\-శ్రీనివాస్‌రెడ్డి,
ఈఈ, నీటిపారుదల శాఖ, కొల్లాపూర్ డివిజన్

జీవరాశులను కాపాడాలి

- పీయూ రిజిస్ట్రార్ రమేష్ బాబు



నీటి తొట్లు ఏర్పాటు చేస్తున్న రిజిస్ట్రార్ రమేష్‌బాబు, విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జీవరాశులను కాపాడాలని పీయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు అన్నారు. బుధవారం పీయూ ఎస్‌డీఎఫ్‌లో భాగంగా పక్షులకు నీటితోట్లు అందించి సకోరా అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రకృతిలో ఎన్నో జీవరాశులు అంతం కావడానికి పరోక్షంగా మానవులే కారణమవుతున్నారని అన్నారు. పీయూలో 175 ఎకరాల్లో దాదాపు 100 ఎకరాలకుపైగా అడవి ఉందని, అందులో 35 నుంచి 40 వరకు పక్షిజాతులు, వివిధ రకాల జంతువులు ఉన్నాయని, ఎండకాలంలో నీటిని, ఆహారాన్ని అందిచడాన్ని ప్రతీ విద్యార్థి అలవాటు చేసుకోవాలన్నారు. పీయూ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య పాల్గొన్నారు.

ఈవ్‌టీజర్లకు కౌన్సెలింగ్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి) : ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న యువకులకు మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసులు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. యువతుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈవ్‌టీజింగ్, సోషల్‌మీడియా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వేధింపులపై షీటీంకు వచ్చిన ఫిర్యాదులపై పోలీసులు కౌన్సె లింగ్ నిర్వహిస్తున్నారు. అమ్మాయిలు సామాజిక మాధ్యమాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏదైన వేధింపులు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

క్రైం కార్నర్

దంపతుల మధ్య గొడవ

» భర్త బలవన్మరణం

గండీడ్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : దంపతుల మధ్య చిన్న విషయంపై జరిగిన గొడవ భర్త ఆత్మహత్యకు దారి తీసింది. మహబూబ్ నగర్ జిల్లా, గండీడు మండలం, మన్సూర్‌పల్లి తండా అనుబంధం, పుర్య నాయక్ తండా శివారులో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పుర్యానాయక్ తండాకు చెందిన అంజిబాయికి, రంగారెడ్డి జిల్లా, ఫరుక్‌నగర్ మండలం పటేల్ చెరువు తండా అనుబంధం చించోడ్ తండాకు చెందిన తుల్సానాయక్ (35)తో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారు తమ కుమారుడు, కుమార్తెల ను చదువు కోసం పుర్యానాయక్ తండాలో ఉంచి మహారాష్ట్రకు వలస వెళ్లారు. 5 రోజుల క్రితం పిల్లల దగ్గరకు వచ్చారు. వేసవి సెలవుల్లో చించోడ్ తండాకు తీసుకెళ్తామని తుల్సానాయక్ అన్నాడు. ఈ విషయంపై మంగళవారం దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన బుధవారం మధ్యాహ్నం తన మామకు చెందిన పొలం లోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి, 108 అంబులెన్సులో కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మానవపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలం, పెద్దమారు గ్రామానికి చెందిన కాశీనాథ్ నాయుడు(32) కర్నూల్‌లోని ఆటో షోరూమ్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం ఆయన కర్నూల్ నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని పడిపోయాడు. హైవే సిబ్బంది గమనించి అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కాశీనాథ్ నాయుడు మృతి చెందాడు. ఆయన భార్య జల్లి గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

కోడేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన వివాహిత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన డ్యాగ శివమ్మ (38), భర్త నర్సింహాల మధ్య మూడురోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరింది. కుటుంబ సభ్యులు ఆమెను గమనించి అంబులెన్స్‌లో హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోకారి తెలిపారు.

ట్రాన్స్‌జెండర్‌తో పాటు మరో ముగ్గురి అరెస్ట్

» వెల్లడించిన సీఐ టంగుటూరి శ్రీను

గద్వాల క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : యువకుడి అనుమానాస్పద మృతి కేసులో ట్రాన్స్‌జెండర్‌తో పాటు, మరో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీ ఐ టంగుటూరి శ్రీను తెలిపారు. విలేకరులతో బుధవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ నాలుగు రోజుల క్రితం అనుమానాస్పదంగా మృతి చెందాడు. అతడి మృతిపై పలు అనుమానాలున్నాయని పేర్కొంటూ, ట్రాన్స్‌జెండర్ శివానితో పాటు, మరో ముగ్గురిపై భార్య కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గద్వాల పట్టణంలో బంధువులు, కుటుంబసభ్యులతో కలిసి ధర్నా చేశారు. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ సందర్భంగా రెండు రోజుల్లో అనుమానితులను అరెస్ట్ చేస్తానని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అప్పటి నుంచి ట్రాన్స్‌జెండర్ శివానితో పాటు ఆటోడ్రైవర్ రోహిత్, రాజు, వీరేశ్‌లపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్ర మంలో ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడులో ట్రాన్స్‌జెండర్ శివాని, వీరేశ్‌లను, గద్వాలలో ఆటోడ్రైవర్ రోహిత్‌తో పాటు రాజును అరెస్ట్ చేశారు. బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐతో పాటు గద్వాల పట్టణం, మల్దకల్ ఎస్‌ఐలు వారిని విచారించి పలు విషయాలను రాబట్టినట్లు తెలిసింది. అనంతరం నలుగురినీ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

డీజే గొడవలో ఇద్దరికి రిమాండ్

గద్వాల క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఓ వివాహ వేడుక సందర్భంగా ఏర్పాటు చేసిన డీజేలో జరిగిన గొడవకు సంబంధించి ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గద్వాల పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఒంటెలపేట కాలనీలో ఈ నెల 10న తేదీన ఓ వివాహ వేడుక సందర్భంగా డీజే ఏర్పాటు చేశారు. కొందరు యువకులు నృత్యం చేస్తూ ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. సంఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు ఇరు వర్గాలకు చెందిన 10 మందిపై కేసులు నమోదు చేశారు. గొడవకు ప్రధాన కారకులుగా ఉన్న మనోజ్, పరశురామ్‌లను బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నడింపల్లిలో ఉద్రిక్తత, 144 సెక్షన్ అమలు

అచ్చంపేట రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లిలో మంగళవారం నాడు బోరం వీరయ్య అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. కుటుంబసభ్యులు ఆయన మృతదేహానికి బుధవారం సాయంత్రం వరకు అంత్యక్రియలు నిర్వహించలేదు. నిందితుల కుటుంబాలు పరారీలో ఉన్నాయి. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎప్పుడు ఏం జరుగు తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు ముందు జాగ్రత్తగా గ్రామంలో 144 సెక్షన్ విధించారు. దాదాపు 100 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. అయితే గత నెల రోజులుగా ఈ కుటుంబాల మధ్య ఘర్షణలు జరుగుతున్నా యని పోలీసులు దృష్టికి కూడా వెళ్లినట్లు తెలిసింది. పంచాయితీ నడిచి నా, రాజీ కుదరకపోడంతోనే ఈ హత్య జరిగిందని కొందరు గ్రామస్థులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ విషయంపై పోలీసు అధికారులను సంప్రదిస్తే వారు సమాధానం దాటవేశారు.

'బావోజీ' ఆదాయం రూ.12.56 లక్షలు

కొత్తపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నారాయణ పేట జిల్లా, కొత్తపల్లి మండలం, తిమ్మారెడ్డిపల్లిలోని బావోజీ ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. ఎస్‌బీఐ, దేవాదయ శాఖ ఆధ్వర్యంలో ఆలయం ఆవరణ లోని కాళికాదేవి గుడి హుండీని లెక్కించగా, రూ. 12,56,723 ఆదాయం లభించినట్లు ఈవో కోమల్ తెలిపారు. ఇంకా బావోజీ, ఆంజనేయ స్వామి ఆలయ హుండీలను లెక్కపెట్టాల్సి ఉందని చెప్పారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, అధికారులు

సఖి సెంటర్‌లో భద్రత కరువు



గద్వాల జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రం

» సరిపోను సిబ్బంది లేక ఇబ్బందులు

» కౌన్సెలింగ్ ఇచ్చే వారు కూడా కరువు

» కొత్త ఏజెన్సీ కోసం ఎదురుచూపులు

» త్వరలోనే సమస్యలు పరిష్కారం : డీడబ్ల్యూవో

గద్వాల క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాలతో ఇబ్బంది పడుతున్న మహిళలు, బాధితులైన బాలికలకు రక్షణ కల్పించే సఖి కేంద్రంలో భద్రత కరువయ్యింది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో బాధిత మహిళలు, బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చే వారు కూడా కరువయ్యారు. దీనికి తోడు అవసరమైన సదుపాయాలు కూడా లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీఏతో పాటు మరి కొన్ని పోస్టులు ఖాళీ

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రంలో సిబ్బంది కొరతతో కౌన్సెలింగ్ కోసం వచ్చే మహిళలు, బాలికలకు సరైన సేవలు అందడం లేదు. ఈ కేంద్రంలో సీఏ (సెంట్రల్ అడ్మినిస్టేటర్)తో పాటు కౌన్సెలర్లు ఇద్దరు, కేస్ వర్కర్లు ముగ్గురు పారామెడికల్ ఉద్యోగి ఒకరు, హెల్పర్లు ముగ్గురు, సెక్యూరిటీ గార్డులు ముగ్గురు, ఐటీ (కంప్యూటర్ ఆపరేటర్) ఒకరు ఉండాలి. కానీ ఇద్దరు సెక్యూరిటీ గార్డులతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్నారు. మిగతా పోస్టులన్నీ ఖాళీ ఉన్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన సీఏ (సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్) సఖి కేంద్రానికి వచ్చిన ఓ మహిళను దూషించి, దురుసుగా ప్రవర్తించింది. దీంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనికి సంబంధించిన వీడియోలు సంబంధిత అధికారులతో పాటు, కలెక్టర్‌కు కూడా చేరడంతో ఆ సీఏను తొలగించినట్లు సమాచారం. దీంతో ఆ పోస్టు నాలుగు నెలలుగా ఖాళీగానే ఉంది. అలాగే రెండేళ్లుగా లీగల్ కౌన్సెలర్లు, ఏడాది నుంచి సోషల్ కౌన్సెలర్ల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ఈ కేంద్రంలో సీఏ (సెంట్రల్ అడ్మినిస్టేటర్)తో పాటు కౌన్సెలర్లు ఇద్దరు, కేస్ వర్కర్లు ముగ్గురు పారామెడికల్ ఉద్యోగి ఒకరు, హెల్పర్లు ముగ్గురు, సెక్యూరిటీ గార్డులు ముగ్గురు, ఐటీ (కంప్యూటర్ ఆపరేటర్) ఒకరు ఉండాలి. కానీ ఇద్దరు సెక్యూరిటీ గార్డులతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్నారు. మిగతా పోస్టులన్నీ ఖాళీ ఉన్నాయి.

కొత్త ఎన్జీవోను నియమించేందుకు చర్యలు

గతంలో బాధ్యతలు నిర్వహించిన స్వచ్ఛంద సంస్థ వల్ల పలు ఇబ్బందులు ఎదురైన మాట వాస్తవమే. సిబ్బంది కొరత కూడా ఉంది. ఇటీవల కొత్త ఎన్జీవోకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఆ సంస్థ నేడో, రేపో బాధ్యతలు స్వీకరించనున్నది. దీంతో సిబ్బంది కొరతతో పాటు అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- సునంద, జిల్లా సంక్షేమాధికారి, గద్వాల.

రక్షణ, సేవలు కరవు

ఆపదలో ఉన్న మహిళలు, లైంగిక వేధింపులకు గురైన బాలికలు, మహిళలు, భర్తలు, కుటుంబ సభ్యుల నుంచి వేధింపులకు గురైన మహిళలను పోలీసులు ఈ కేంద్రానికి పంపిస్తారు. అలాంటి వారికి న్యాయ, వైద్య, పోలీసు సాయంతో పాటు, పాటు కౌన్సెలింగ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గతంలో ఈ కేంద్రాన్ని నాగర్‌కర్నూల్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ నిర్వహించింది. కానీ సరైన పర్యవేక్షణ, నిర్వహణ లేక కేంద్ర పనితీరు అస్తవ్యస్తంగా మారింది. దీంతో బాధిత మహిళలు, బాలికలు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

ఘనంగా సాయిబాబా మందిర రజతోత్సవం





పూజలు నిర్వహిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు, సీతాదయాకర్‌రెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలోని సాయిబాబా ఆలయం రజతోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ రావుల గిరిధర్ దంపతులు సాయిబాబాను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే జడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి దంపతులు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నారాయణ పేట జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలల పరిరక్షణ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖులను ఘనంగా సన్మానించారు. వ్యాపారవేత్త బంగారు భాస్కర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

జోగుళాంబ సన్నిధిలో జీయర్ స్వామి



రామానుజన్ జీయర్ స్వామికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

అలంపూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ క్షేత్రాన్ని విజయవాడ పీఠం అష్టాక్షరి సంపత్‌కుమార్ రామానుజన్ జీయర్ స్వామి సందర్శించారు. బుధవారం ఆలయానికి వచ్చిన ఆయనకు ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో ఆయనను ఘనంగా సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఇల్లూరి వెంకట్రామయ్య శెట్టి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలేపల్లిలో త్రిసభ్య కమిటీ విచారణ



పోలేపల్లి పంచాయతీ కార్యాలయంలో విచారిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

జడ్చర్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పోలేపల్లి గ్రామ పంచాయతీలో 2019-20 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన అవినీతి, అక్రమాలపై బుధవారం త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. 2019 - 2024 సంవత్సరాల మధ్య దాదాపు కోటి రూపాయలకు పైగా నిధులు దుర్వినియోగం అయ్యాయని గతంలో ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై గత సంవత్సరం ఆగస్టులో ఎంపీవో సరోజ, బదిలీపై వెళ్లిన, వచ్చిన గ్రామ కార్యదర్శులు శివప్రసాద్, లక్ష్మీనారాయణలను అప్పటి డీఎల్‌పీవో పండరీనాథ్ విచారించారు. రూ.1.73 కోట్ల అవినీతి, అక్రమాలు జరిగాయని తేల్చి, పూర్తి నివేదికను గత సంవత్సరం సెప్టెంబరులో కలెక్టర్‌కు సమర్పించారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టేందుకు కలెక్టర్ ఆదేశం మేరకు డీఆర్‌డీవో నర్సింహులు, పీఆర్ ఈఈ నరేందర్‌రెడ్డి, జడ్చర్ల ఎంపీడీవో విజయకుమార్‌లతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విచారణకు అప్పటి గ్రామపంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ హాజరయ్యారు. అప్పటి సర్పంచ్ చేతనారెడ్డి వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలోని అన్ని రికార్డులను పరిశీలించారు. అప్పటి సర్పంచ్ హాజరు కానందున మరో నోటీసు జారీ చేసి, విచారణ చేపడ్తామని అధికారులు వెల్లడించారు. విచారణలో ఎంపీవో సరోజ పాల్గొన్నారు.

నకిలీ సీడ్ పత్తి విత్తనాల స్వాధీనం



నకిలీ సీడ్ విత్తనాలను పరిశీలిస్తున్న గద్వాల సీఐ టంగుటూరి శ్రీను

మల్దకల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలం కుర్తిరావులచెరువు శివారులోని పొలంలో నిల్వ చేసిన నకిలీ సీడ్‌పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నందీకర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు గ్రామ శివారులో, సబ్ ఆర్గనైజర్ కురువ శ్రీను అలియాస్ రాజుకు చెందిన పొలంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అక్కడి షెడ్ వద్ద 51 పాలిథిన్ బస్తాల్లో నిల్వ ఉంచిన 1,275 కిలోల నకిలీ సీడ్ పత్తి విత్తనాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మండలంలో ఎక్కడైనా నకిలీ విత్తనాలు నిల్వ ఉంచినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. నకిలీ విత్తనాలు అక్రమంగా నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు మల్దకల్ ఎస్‌ఐ ఇచ్చిన సమాచారం మేరకు గద్వాల సీఐ టంగుటూరి శ్రీను గ్రామానికి చేరుకొని నకిలీ విత్తనాలను పరిశీలించారు. దాడిలో వ్యవసాయ అధికారి రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, కానిస్టేబుళ్లు నిరంజన్, నవీన్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రం.. పోటాపోటీగా ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప

» మొదట మార్కెట్ కమిటీ చైర్మన్, ఆ తర్వాత ఎమ్మెల్యే

ఎర్రవల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండలంలోని కొండేరు, జింకలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు ఎమ్మెల్యే విజయుడితో పాటు, అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్పను ఆహ్వానించారు. కొండేరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్దకు ముందుగా మార్కెట్ కమిటీ చైర్మన్ వచ్చారు. ఎమ్మెల్యే వస్తున్నారని, కలిసి ప్రారంభించాలని అధికారులు ఆయనకు సూచించారు. కానీ తనకు అత్యవసర పని ఉందని చెప్తూ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత జింకలపల్లిలోని కేంద్రాన్ని కూడా ప్రారంభించి వెళ్లిపోయారు. అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండేరు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకొని, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు మళ్లీ ఆయనతో కేంద్రాన్ని ప్రారంభింపచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి అధిక ధరను పొందాలని రైతులకు సూచించారు. అవకతవకలకు తావు లేకుండా, నిబంధనల ప్రకారం కేంద్రాన్ని కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ ప్రొటోకాల్ అమలుపై పెదవి విరిచారు. తాను వస్తున్నట్లు అధికారులు చెప్పినా వినకుండా మార్కెట్ కమిటీ చైర్మన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం సరికాదన్నారు. దళిత ఎమ్మెల్యేను అవమానించినట్లే అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఏపీఎం కురుమన్న, ఏఈవో ప్రవళిక, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, డైరెక్టర్ రుక్మానందరెడ్డి, సోమనాద్రి, వెంకటేశ్, మాజీ సర్పంచ్ ఈరన్న, బొట్టుబిళ్ల ఈరన్న పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్, వ్యక్తికి తీవ్ర గాయాలు

వంగూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళ్తూ, అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని సర్వారెడ్డిపల్లి తండా గేటు సమీపంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. నల్గొండ జిల్లా, డిండి మండలం తవకలాపూర్ తండాకు చెందిన భీముడు వ్యక్తిగత పని మీద ద్విచక్రవానంపై కల్వకుర్తికి వచ్చాడు. స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో అతడి కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో అతడిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అంబులెన్స్ డ్రైవర్ శ్రీశైలం తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. మండలంలోని మల్లేపల్లి గ్రామ శివారులో బుధవారం ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని యజమానులు శ్రీశైలం, రామకృష్ణ, లింగమయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిరసనగండ్ల హుండీ లెక్కింపు

» రూ. 12.67 లక్షల ఆదాయం



ఇండోనేషియా 2వేల నోటు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

చారకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలం, సిరసనగండ్ల సీతారామచంద్ర స్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. ఇటీవలే బ్రహ్మోత్సవాలు ముగియడంతో హుండీని లెక్కించినట్లు ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో ఆంజనేయులు తెలిపారు. హుండి ఆదాయం రూ.12,67,915 వచ్చినట్లు చెప్పారు. గత ఏడాది కంటే రూ. 4,40,937 ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. ఇండోనేషియాకు చెందిన ఓ భక్తుడు హుండీలో 2వేల నోటును వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ నాగర్‌కర్నూల్ డివిజన్ పరిశీలకురాలు వీణాధరి, తహసీల్దార్ అద్దంకి సునీత, ఎస్‌ఐ శంషుద్దీన్, యూనియన్ బ్యాంకు మేనేజర్ నరసింహ, సిరసన గండ్ల పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, మేనేజర్ నిరంజన్, జూనియర్ అసిస్టెంట్ డేరం కోదండరామశర్మ, అర్చకులు డేరం మురళీధరశర్మ, డేరం లక్ష్మణశర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాఠకులకు మరిన్ని పుస్తకాలు అందిస్తాం



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు

మానవపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాఠకులు, సాహితీప్రియుల కోసం గ్రంథాలయాల్లో మరిన్నిపుస్తకాలు ఏర్పాటు చేస్తామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయానికి వచ్చారు. రిజిస్టర్లు, పుస్తకాలను పరిశీలించారు. ఉన్నత చదువులకు, నిరుద్యోగులకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులోకి తెస్తామని అన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మాణిక్యమ్మ, పీటీడబ్ల్యూ గోకారి, నాయకులు రమేశ్, జగ్గుల ప్రభాకర్, విద్యాసాగర్ ఉన్నారు.

పశువుల సంరక్షణకు టీకాలు వేయించాలి

వడ్డేపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి సోకకుండా పశువుల సంరక్షణ కోసం టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ స్వరూప పశువుల యజమానులు, రైతులకు సూచించారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని జూలేకల్, పైపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచితటీకాల శిబిరంలో గేదెలు, ఎద్దులు, ఆవులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వీఎల్‌వో వరప్రసాద్, ఎల్ఎస్‌ఏ లతీఫ్, బుచ్చమ్మ, ఓఎస్ వెంకటమ్మ, కృష్ణ, గోపాలమిత్ర నారాయణగౌడ్ ఉన్నారు.

బాల్య వివాహాలు నేరం

అయిజ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డీసీపీవో నరసింహ అన్నారు. బుధవారం అయిజ మండలంలోని బింగిదొడ్డిలో ఉపాధి కూలీలకు ఈఅంశంపై అవగాహన కల్పించారు. ఏగ్రామంలో అయినా బాల్యవివాహాలు చేసినట్లు అయితే 1098 హెల్ప్‌లైన్ నెంబర్ ఫోన్ చేయవచ్చని సూచించారు. పిల్లలను బాలకార్మికులుగా మార్చటం, భిక్షాటన చేయించటం నేరమని తెలిపారు. 18సంవత్సరాలు నిండిన తర్వాతనే ఆడపిల్లలకు పెళ్లి చేయాలని చెప్పారు. మగపిల్లలతో సమానంగా చదివించాలని చెప్పారు.

19న భూ భారతిపై అవగాహన సదస్సు

ఎర్రవల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతిపై ఎర్రవల్లి మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 19న రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నరేశ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హాజరవుతున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ చట్టంలోని భూసంబంధిత విధివిధానాలపై సమూల మార్పులు, సంపూర్ణ ప్రక్షాళనపై అవగాహన ఉంటుందని, కార్యక్రమానికి రైతులు, మండల ప్రజలంతా హాజరుకావాలని కోరారు.


నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాలఅర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని 33కేవీ ఆయిల్‌సీడ్ ఫీడర్ పరిధిలో లైన్‌లకు తాకే చెట్లకొమ్మలను తొలగిస్తున్నందున ఈనెల 17న గురువారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూడూరు, కొండపల్లి, బసలచెరువు, మేళ్లచేరువు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అగ్రహారం రోడ్డులో...

అగ్రహారం రోడ్డులో ఉన్న 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ధరూర్, నర్సందొడ్డి, ఆత్మకూరు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నీలహళ్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ధరూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏఈవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, మహిళా సంఘం సభ్యురాలు జయమ్మ, సరోజ ప్రారంభించారు. రైతులు పండించే వడ్లకు మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఏఈవో సూచించారు. ప్రతీ రైతు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీరారెడ్డి, బోయ హన్మంతు, మాజీఎంపీటీసీ సభ్యుడు బోయ ఈరన్న, దుబ్బన్న, శశిధర్, విజయ్‌గౌడ్, నవారప్ప, నర్సింహులు, జగన్, అంజనేయులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం వద్దు

▸▸ పనుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష ▸▸ వారానికోసారి నివేదిక ఇవ్వాలని ఎంపీడీవోలకు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై బుధవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్‌హాలులో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని, పూర్తి పారదర్శకంగా ఉండాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణ పను లు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. గ్రామస్థాయిలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. పర్యవేక్షణకు ప్రతీ నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో గ్రామ కార్యదర్శుల సమన్వయంతో స్థలాలను గుర్తించి బేస్‌మెంట్ నిర్మాణం నిర్ధారించాలని ఆదేశించారు. ప్రతీ వారం నిర్మాణ పురోగతిపై నివేదికను సమర్పించాలన్నారు. అలాగే రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డీపీవో నాగేంద్రం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్‌బాబు, పుర కమిషనర్లు ఉన్నారు.

వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలి

వేసవిలో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. నీటి కొరత ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. బల్క్ వాటర్ సప్లై, ఓహెచ్ఎస్ఆర్, సింగిల్ ఫేజ్ చేతి పంపులు, ప్రైవేట్ బోర్‌వేల్స్, ట్యాంకర్లు వంటి అన్నిమార్గాలను సమర్థవంతంగా ఉపయోగించి నీటి సమస్య లేకుండా చూడాలన్నారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను బుధవారం కలెక్టర్, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, సురేశ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

కులాంతర వివాహ ప్రోత్సాహకం అందజేత

కులాంతర వివాహం చేసుకున్న జంటకు బుధవారం ఐడీవోసీ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతిని కలెక్టర్ అందజేశారు. గద్వాల పట్టణానికి చెందిన టి.ఎం.మౌనిక భర్త రమేశ్ (ఎస్సీ) కులాంతర వివాహం చేసుకున్నందుకు ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహకంగా రూ.2,50లక్షలు మంజూరయ్యాయి. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో జంటకు బాండ్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సరోజ, సంబంధిత అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలపై చార్జిషీట్ కక్షపూరితం

● కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత

● హెడ్ పోస్టాఫీస్ ఎదుట కాంగ్రెస్ శ్రేణుల నిరసన



గద్వాల హెడ్ పోస్టాఫీస్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి తమ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జిషీట్ దాఖలుచేయడం రాజకీయ కక్షపూరితమని జడ్పీమాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గం ఇన్‌చార్జి సరిత అన్నారు. ప్రతిపక్ష పార్టీలపై అక్రమ కేసులు బనాయిస్తున్న బీజేపీ ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానపరుస్తున్నట్లు ఆరోపించారు. సోనియా, రాహుల్‌గాంధీపై కేసు నమోదును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ ఎదుట నిరసనప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన సరిత, కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను బీజేపీ నాయకులు జీర్ణించుకోలేక పోవడం దౌర్భాగ్యమన్నారు. అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తుందన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా పాలక బీజేపీ తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకుందన్నారు. టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు శంకర్ మాట్లాడుతూ ప్రతిపక్షాలను రాజకీయంగా వేధించేందుకు సీబీఐ, ఈడీ వంటి సంస్థలను ఉసిగొల్పడం రాజ్యాంగ విరుద్ధమని, ఇందుకు పాలకులు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఇసాక్, డీఆర్ శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్‌యాదవ్, పీఎస్ఆర్ జగదీశ్, ఆనంద్‌గౌడ్, రంజిత్‌కుమార్, జయకృష్ణ, బాలకృష్ణనాయుడు, బీఆర్ ఇమ్మానుయేల్, రాము, వెంకట్రాములు, అంజనేయులు, కృష్ణమూర్తి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆర్.తిరుమలేశ్ ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



గద్వాల ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న రంగస్వామి, హలీంపాషా

గద్వాలటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రంగస్వామి, పీడీఎస్‌యూ జిల్లాఅధ్యక్షుడు హలీంపాషా కోరారు. బుధవారం గద్వాల ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం వేసవిలో బడులను ఒంటిపూట నిర్వహించాలని నిబంధన విధించినా కొన్ని పాఠశాలల్లో సాయంత్రం ఐదుగంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు అధికారి దృష్టికి తెచ్చారు. దీంతోపాటు కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురిస్తున్నట్లు ఆరోపించారు. సకాలంలో ఫీజులు చెల్లించలేని విద్యార్థులను తరగతి గదిలో అవమానకరంగా తిట్టడం వల్ల విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పలు పాఠశాలల్లో అడ్మిషన్లు చేపడుతున్నారన్నారు. పూర్తిస్థాయి సౌకర్యాలు లేని పాఠశాలలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆసుపత్రిని వినియోగంలోకి తేవాలి

- సీపీఎం నాయకుల డిమాండ్

అలంపూరుచౌరస్తా, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): అలంపూరు చౌరస్తాలో నిర్మించిన వందపడకల ఆసుపత్రికి సిబ్బందిని కేటాయించి వినియోగంలోకి తేవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు సదరు ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తేవడంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకుని అందుబాటులోకి తేవాలని, సరైన వైద్యం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, పరంజ్యోతి, ఈదన్న, శేషన్న, దేవన్న, మహేశ్, శివప్రసాద్ ఉన్నారు.

విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



అయిజలో విత్తనాల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏవో, ఎస్సై

అయిజ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో అధికారులు బుధవారం తనిఖీ చేశారు. వ్యవసాయాధికారి జనార్దన్, ఎస్సై శ్రీనివాసరావు స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు నాణ్యతలేని, నకిలీ విత్తనాలు విక్రయించే అవకాశం ఉంటుందని తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. అలా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో కచ్చితంగా రశీదు తీసుకోవాలని సూచించారు.

పెద్దవాగు పరిశుభ్రమయ్యేనా?

▸▸ మురుగునీరు నిలిచిపోవడంతో భరించలేని దుర్గంధం

▸▸ జమ్ము, కంపతారు చెట్లతో నిండిన పరిసరాలు

▸▸ శుభ్రం చేయాలని కోరుతున్న ప్రజలు



మైలోనిగడ్డ, మాలపేట ఏరియాలో వాగు ఇలా

అయిజ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మానవ సమూహాలు నివసించే పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యక్తులు ఆరోగ్యాలు కూడా బాగుంటాయి. కానీ అయిజ పట్టణంలోని పెద్ద వాగులో పేరుకుపోయిన మురుగుతో పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయిజలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంతం, మాలపేట, ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలు, అంబేడ్కర్‌చౌక్, మైలోనిగడ్డ, నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంతం, బోయపేట, సంతబజారు కాలనీ, ఎస్సీ కాలనీలను ఆనుకుని పెద్దవాగు ప్రవహిస్తున్నది. దాదాపు పదేళ్లుగా వాగును శుభ్రం చేయకపోవటంతో అందులో చెత్త, చెదారం పేరుకుపోయి మురుగునీటితో బురదమయంగా తయారైంది. దీనికితోడు వాగులో జమ్ము, కంపచెట్లతో పాటూ, ఇతర పిచ్చిమొక్కలు పెరిగి చిన్నపాటి అడవిని తలపిస్తున్నది. వాగు పొడవునా ఉన్న ఆయాకాలనీల ప్రజలు వాగులోని బురద నీటి వల్ల వచ్చే దుర్వాసనను భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండాకాలం కావటంతో పగలంతా ఎండకు మగ్గి రాత్రి అయ్యిందంటే వాగునుంచి వచ్చే కంపుతో ఇళ్లలో తలుపులు మూసుకోవలసి వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. పశువైద్యశాల ఏరియాలో అయితే వాగులో పెద్దఎత్తున పాలిథిన్ కవర్లు పేరుకుపోయి పెద్ద గుంతమాదిరిగా మురుగు, బురద నిల్వ ఉంది. అటుగా బోయపేటకు, సంతబజారుకు, అయిజ పట్టణంలోకి వెళ్లేవారు 300 మీటర్ల దూరం వరకు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా జమ్ము, కంపచెట్లు, ఇతర పిచ్చిమొక్కల్లో విషపురుగులు సంచరిస్తూ వాగును ఆనుకుని ఉన్న ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పట్టణంలోని నడిబొడ్డులో ఉన్న పెద్దవాగును ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలంటూ కోరుతున్నా పట్టించుకోవటంలేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మునిసిపాలిటీ అధికారులు తిక్కవీరేశ్వరస్వామి ఆలయ పరిసరాల నుంచి ఎస్సీకాలనీ చివరి వరకు పెద్దవాగులో నిండి ఉన్న బురదను శుభ్రం చేయటంతో పాటు, జమ్ముకంప చెట్లను, ఇతర పిచ్చిమొక్కలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. గట్టు మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డికి చెందిన జయలక్ష్మికి చికిత్స నిమిత్తం రూ.42వేలు మంజూరయ్యాయి. ఆ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరక్టర్ తిమ్మప్ప, ఎంపీపీ మాజీ వైస్ చైర్మన్ రామకృష్ణనాయుడు, జెడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ ఇమామ్‌సాబ్, అహ్మద్, నారాయణ, నర్సింహులు, సిద్దప్ప ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి



అగ్నిప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

● అగ్నిమాపక శాఖ అధికారి రాకేశ్

గద్వాల క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై మహిళలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి రాకేశ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీ రెసిడెన్సీలో మహిళలకు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వంట చేస్తున్నప్పుడు సిలిండర్ నుంచి మంటలు వస్తే వాటిని ఎలా ఆర్పాలో ప్రత్యక్షంగా చేసి చూపారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలో తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 101కు కాల్ చేయాలని సూచించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరుగకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది వెంకటయ్య, జహంగీర్, ఎం.డి. గౌస్‌పాషా, లక్ష్మన్న నాయుడు, మహేందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిపై నాయకులకు శ్రద్ధ ఏదీ?



అయిజలో విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అయిజ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అయిజ పట్టణ అభివృద్ధిపై అలంపూర్ నియోజకవర్గ నాయకులకు శ్రద్ధ ఏదీ అని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం అయిజలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టిన 16నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ నియోజకవర్గాలకు 16ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాలలు (ఏటీసీ) మంజూరు చేసిందన్నారు.ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న అయిజలో కూడా చాలాఏళ్లుగా వృత్తివిద్యా కళాశాల, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉన్నా ఇక్కడి నాయకులు ఎందుకు మంజూరు చేయించటం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉన్నా కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయకపోవటం ఏమిటని ప్రశ్నించారు. అయిజ రెవెన్యు డివిజన్ కావటం, అయిజలో మరో కొత్త మండలం ఏర్పాటయ్యేందుకు అవకాశమున్నా వీరి నిర్లక్ష్యం వల్లే విద్యాపరంగా వెనకబాటుకు గురవుతున్నామని ఆరోపించారు. అధికార పార్టీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే అయినా సీఎంతో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో భీంసేన్‌రావు, వీరయ్యాచారి, లక్ష్మణ్‌ఆచారి, నర్సింహ, రఘు, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న పాలకమండలి చైర్మన్, సభ్యులు

అలంపూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధి పనులపై ఆలయ పాలక మండలి సమావేశాన్ని చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశం హైలెవెల్ కమిటీ సూచన మేరకు ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు.

సమావేశంలో ఈవో పురేందర్ కుమార్, ధర్మకర్తలు జగదీశ్వర్‌గౌడ్, జగన్‌మోహన్‌నాయుడు, వెంకటేశ్వర్లు, కే.గోపా ల్, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

సరైన కొలతలతో దుస్తులు సిద్ధం చేయాలి

మల్దకల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా తరగతుల వారీగా ఏకరూప దుస్తులను సిద్ధం చేయాలని ఎంఈవో సురేశ్ సూచించారు. బుధవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ తరగతుల వారీగా విద్యార్థుల కొలతలు తీసుకుని పకడ్బందీగా కుట్టాలన్నారు.

కార్యక్రమంలో ఎంఎస్‌వో నరేష్, ప్రధానోపాధ్యాయులు, మండల మహిళా సమాఖ్య ఏపీఎం నరహరి, అధ్యక్షుడు సుజాత, సీసీవోలు, టైలర్లు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్



ఎస్.వినయ్

గద్వాల క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.వినయ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేటలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ జి ల్లాకు బదిలీ అయ్యారు. ఈ సం దర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. గద్వాల జిల్లాలో ఆర్ఎంపీలు ఎక్కువగా యాంటిబయాటిక్‌లు ప్రజలకు ఇస్తున్నట్లు తెలిసిందని, త్వరలోనే ప్రథమ చికిత్సా కేంద్రాలపై దాడులు నిర్వహిస్తామన్నారు.

అలాగే జిల్లాలో స్టెరాయిడ్ నివారణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఎంపీలు వైద్యం కోసం వచ్చే రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, సర్జరీలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.